క్లుప్తంగా

మండల సభ వాయిదా



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీవో

మానకొండూర్‌రూరల్‌: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీల ఫోరం సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కానందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ సులోచన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, వివిధశాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అన్నదాన భవనం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ట్రస్ట్‌ వారసులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయం(బొమ్మలగుడి)లో అన్నపూర్ణ నిత్యాన్నసేవ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది ఈ సందర్భంగా ఆలయం ట్రస్టీ కొండూరి సహకారంతో ప్రాంగణంలో అన్న ప్రసాద భవనాన్ని, యాగశాల నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అన్నదాన భవనం, యాగశాల నిర్మాణానికి దాతలు మహాలక్ష్మి ఐరన్‌ హార్డ్‌వేర్‌ యజమాని రవీందర్‌రావు సౌజన్యంతో నిర్మాణం పూర్తిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొండూరు దుర్గాప్రసాద్‌, వెంకటరాజ్‌ అన్నపూర్ణ సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

రామడుగు: కరీంనగర్‌ జిల్లాకేంద్రంలో జూన్‌ 6న, నిర్వహించే రెడ్డిల ఆత్మీయ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను మండలంలోని శ్రీరాములపల్లిలో గురువారం రెడ్డిసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాలో రెడ్డి..చలో కరీంనగర్‌ కార్యక్రమంలో రెడ్డికులస్తులు భాగస్వాములు కావాలని కోరారు. రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు కోస్న వెంకట్‌రెడ్డి, నారెడ్డి రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చల్మారెడ్డి, వీరారెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు ప్రారంభిస్తున్న కౌన్సిలర్‌

చొప్పదండి: ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల్లో నూతన ఓటర్లు ఓటర్‌గా నమోదు చేసుకుని ఓటుహక్కు వినియోగించుకోవాలని రెండో వార్డు కౌన్సిలర్‌ మాదూరి శ్రీనివాస్‌ అన్నారు. పట్టణంలోని రెండోవార్డులో గురువారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓటుహక్కు నమోదు కేంద్రం ఏర్పాటుచేశామని 18ఏళ్లు నిండిన వారికి ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పత్రాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందుండాలి

గన్నేరువరం: అభివృద్ధి పనుల్లో గన్నేరువరం మండలం ముందుండాలని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్‌ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనుల్లో పురోగతి సాధించాలని కోరారు. రైతులకు ఇబ్బందులు లేకుండా విత్తనాల పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. నేటినుంచి నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్‌ అనంతరెడ్డి ఎంపీడీవో స్వాతి, వివిధశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టితరలింపు

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని బొత్తలపల్లి గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలోని చెరువు నుంచి గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా మట్టిని తరలిస్తున్నారని, మట్టి తరలింపును అడ్డుకుంటే కర్రలతో దాడి చేస్తు న్నారని అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు చేపడుతామని గ్రామస్తులు హెచ్చరించారు.

స్వచ్ఛ సంకల్పం.. పల్లె ప్రగతి పథం

- కొనసాగుతున్న పారిశుధ్య వారోత్సవాలు

హుజూరాబాద్‌రూరల్‌: గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిచేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే పట్టణ, పల్లెప్రగతి పేరిటా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వర్షాకాలం సమీపిస్తుండడంతో ముందు జాగ్రత్తగా ఇటీవలే పల్లెల్లో పారిశుధ్యం పనులు చేపట్టారు.



శాలపల్లి ఇందిరానగర్‌లో చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న పారిశుధ్య కార్మికులు

అన్ని గ్రామాల్లో

హుజూరాబాద్‌ మండలవ్యాప్తంగా 19 గ్రామపంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాలను కలుపుకుని మండలంలో 23 గ్రామాలున్నాయి. వర్షాలు కురిస్తే పారిశుధ్య లోపంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గుర్తించిన అధికారులు స్పెషల్‌డ్రైవ్‌ కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో ప్లాస్టిక్‌ వినియోగం తగ్గించాలని చాలాకాలంగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ వాడకం తగ్గించకుండా చెత్తకుప్పలు, డ్రైనేజీల్లో పడేస్తుండడంతో మురుగునీరు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. పలుచోట్ల మంచినీటి పైప్‌లైన్ల లీకేజీలు దర్శనమిస్తున్నాయి. వీటి నిర్మూలనకు అన్నిరకాల చర్యలు తీసుకుంటే ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చని భావిస్తున్నారు. ప్రతీపంచాయతీకి ఒకటి చొప్పున ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. గ్రామ గ్రామాన కంపోస్టు షెడ్లనిర్మాణాలు పూర్తి చేశారు. నిర్వహణ లోపంతో పలు గ్రామాల్లో చెత్తసేకరణ చేస్తున్నా రోడ్లవెంట పారబోస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయి. కనీసం ఇప్పుడైనా మెరుగుపర్చాలని ఆశిస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల కొరత

ఆయా గ్రామాల్లో జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పారిశుధ్యం లోపిస్తోంది. 19 గ్రామపంచాయతీలుండగా, ప్రతీ జీపీలో వెయ్యికి పైగా జనాభా ఉండగా, రోడ్లను శుభ్రం చేయడంతో పాటు, మురుగు కాలువలను శుభ్రం చేయడం, ఇంటింటా చెత్త సేకరణ వంటి పనులతో పారిశుధ్య కార్మికులకు పని భారం పడుతోంది. అదనంగా పారిశుధ్య కార్మికులను నియమించుకోవాలంటే ప్రభుత్వం నుంచి పంచాయతీలకు ప్రత్యేక నిధులేమి కేటాయించకపోవడంతో గ్రామపంచాయతీ పాలక వర్గాలు నియామకంపై దృష్టిసారించడం లేదు.

చేపడుతున్న పనులు...

- మంచినీటి పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టడం.
- నీటి నిల్వఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్‌ వేయడం.
- రహదారులు శుభ్రం చేయడం
- ఇళ్ల మధ్య, రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగించడం.
- ఇంకుడు గుంతలపై అవగాహన.
- వ్యక్తిగత మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో వినియోగించేలా అవగాహన కల్పించడం.
- మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయడం.
- తడి,పొడి చెత్తను వేరుచేయటం.
- విద్యుత్‌ అభివృద్ధి పనులు నిర్వహించడం.

పకడ్బందీగా పారిశుధ్య పనులు



గ్రామంలో రోజువారి పారిశుధ్య పనులు నిర్వహి స్తుండడంతో పాటు, అదనంగా మురుగు కాలువల వెంట ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్నాం. గ్రామంలో పారిశుధ్య కార్మికుల కొరతతోఉంది. గ్రామంలో పకడ్బందీగా పారిశుధ్యం పనులు కొనసాగుతున్నాయి.

– కే.శారద, సర్పంచ్‌, శాలపల్లి ఇందిరానగర్‌

ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు



వర్షాలు పడకముందే పారిశుధ్యం పనులన్నీ పూర్తిచేసి పల్లెల్లో ఆహ్లాద వాతావరణం కల్పించాలన్నది సర్కారు సంకల్పం. ప్రభుత్వలక్ష్యం నెరవేర్చేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నాం. అన్ని గ్రామాల్లో చురుకుగా పారిశుధ్య పనులు జరుగుతున్నాయి. ప్రశాంత వాతవరణం కల్పిస్తాం.

– విజయలక్ష్మి, ఎంపీడీవో, హుజూరాబాద్‌

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి

- హుజూరాబాద్‌ డివిజన్‌ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి
- వలు పోలీస్‌స్టేషన్లలో ఉత్సవాల పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్‌/జమ్మికుంట/ఇల్లందకుంట/చిగురుమామిడి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్‌ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో, జమ్మికుంట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో, జమ్మికుంట రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను పట్టణ సీఐ బొల్లం రమేశ్‌తో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్రప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను 21 రోజులు నిర్వహిస్తుండగా రోజుకో శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈక్రమంలో 4న సురక్షా దినోత్సవాన్ని నిర్వహిస్తూ పోలీసు శాఖ సాధించిన ఘనతను, విజయాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో పోలీసు సేవలు ఎలా ఉన్నాయో వివరిస్తూ కరపత్రాలు అందిస్తామన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా డివిజన్లోని అన్ని పోలీస్‌స్టేషన్‌లో జెండా ఆవిష్కరణ చేస్తామన్నారు. ప్రతిభగలహోంగార్డు,కానిస్టేబుల్‌, హెడ్‌ కానిస్టేబుల్‌, ఏఎస్సై, ఎస్సైలకు ప్రతిభ అవార్డు అందించనున్నట్లు పేర్కొన్నారు. జూన్‌ 12న హుజూరాబాద్‌ నియోజకవర్గ స్థాయిలో 2కె రన్‌ అన్నివర్గాల ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లోహరితహారంలో భాగంగా మొక్కలు నాటుదామన్నారు. ఇల్లందకుంట ఎస్సై తిరుపతి, ఏఎస్సై రవి, రూరల్‌ సీఐ జవ్వాజీ సురేశ్‌, ఎస్సైలు తిరుపతి, శేఖర్‌రెడ్డి పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 2 నుంచి 22 వరకు రోజువారీగా నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని చిగురుమామిడి ఎంపీపీ కొత్తవినీత కోరారు. చిగురుమామిడి మండలపరిషత్‌ కార్యాలయంలో మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్‌ చైర్మన్‌, రైతుబంధు సమితి గ్రామస్థాయి కోఆర్డినేటర్లు, వార్డుసభ్యులు, సింగిల్‌విండో డైరెక్టర్లు నేటి నుంచి నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. పదేళ్ల జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు వివరించాలని వారిని భాగస్వాములను చేయాలన్నారు.

గన్నేరువరం: దశాబ్ది ఉత్సవాలపై మండలకేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మాడుగుల రవీందర్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న సుపరిపాలన దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో 3 వేల మందితో ప్రగతి నివేదన సభ(ధూంధాం) కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ జిల్లా కోఆర్డినేటర్‌ గూడెల్లి తిరుపతి, తహసీల్దార్‌ అనంతరెడ్డి, ఎంపీడీవో స్వాతి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఆర్‌ఎస్‌ఎస్‌ మండల కోఆర్డినేటర్‌ తిరుపతిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్‌ రోడ్డు పూర్తయ్యేదెన్నడో?

- ఎమ్మెల్యే రసమయిని ప్రశ్నిస్తూ వెలసిన ఫ్లెక్సీలు



గన్నేరువరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా రాజన్నసిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్‌ రోడ్డు పనులు పూర్తయ్యేదెన్నడంటూ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ప్రశ్నిస్తూ గురువారం మండలంలో వెలసిన ఫ్లెక్సీలు కలకలం సృష్టించాయి. దీనిపై మండల ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. గుండ్లపల్లి నుంచి మండలకేంద్రం వరకు రహదారి అధ్వానంగా ఉందని డబుల్‌ రోడ్డు నిర్మాణానికి బీజేపీ చేపట్టిన పాదయాత్ర, ఆందోళన ఫోటోలతో ఈ రహదారి నుంచి వెళ్లే గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. రహదారి పనుల కోసం రూ.71 కోట్లు నిధులు మంజూరైనట్లు గతంలో జీవో వచ్చిందని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. కాని నేటికి ఆ పనులకు అతిగతి లేదన్నారు. రహదారి అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఇచ్చిన జీవో వట్టిదేనా అంటూ ప్రశ్నించారు. గుండ్లపల్లి నుంచి గునుకులకొండాపూర్‌ వరకు రహదారిని తవ్వి మట్టిపోశారని, దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇదేనా మండల అభివృద్ధి అంటూ ప్రశ్నించారు.

పరిహారం ఎప్పడిస్తారో?

రామడుగు: వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఎప్పుడు అందిస్తారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కాంగ్రెస్‌, బీజేపీల నాయకులు గురువారం ప్రశ్నించారు. వెలిచాల రైతువేదిక ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేను కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి సీఎం రామడుగు మండలంలో పంట నష్టపోయిన రైతులను పరామర్శించి పంటపరిహారం అందిస్తామని చెప్పి రెండునెలలు గడుస్తున్నా నేటికి పరిహారం అందించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌, బీజేపీల నాయకులు పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్‌, బొమ్మరవేని తిరుపతి, మోడీ రవీందర్‌, పంజాల శ్రీనివాస్‌, ఎడవెల్లి లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

రైతువేదికలకు ఇన్‌చార్జీలు

చొప్పదండి: రైతుదినోత్సవం సందర్భంగా ఈనెల 3న నిర్వహించే కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ కోరారు. ఒక్కో రైతువేదికకు ముగ్గురు చొప్పున ఇన్‌చార్జీలను నియమించామని, అందరు సమన్వయంతో రైతు దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. ఆరు మండలాల్లోని రైతువేదికల్లో రైతుదినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికం | సీతారామ పట్టాభిషేక వార్షికోత్సవాలు



నగరంలోని వేద భవనంలో వికాస తరంగిణి, జెట్‌ ఆధ్వర్యంలో సీతారామ పట్టాభిషేక నాల్గో వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విష్ణుసహస్రనామ పారాయణం, మత్తికా సేకరణ, అంకురార్పణ, రక్షాబంధనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు కె.గౌతమరావు, కార్యదర్శి యాద కిషన్‌, రవీందర్‌రావు, సభ్యులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

– కరీంనగర్‌ కల్చరల్‌

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి



సప్తగిరికాలనీ: ఉపాధ్యాయులందరూ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గొట్టె ప్రమోద అన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట ప్రణాళిక సమావేశంలో మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో బడి పిల్లల ప్రవేశాలకు ప్రతిరోజూ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న కార్పొరేటర్‌ బుచ్చిరెడ్డిని పాఠశాల బృందం శాలువాతో సత్కరించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణరావు, శ్రీనివాస్‌, గీత, శంకరయ్య, నంది శ్రీనివాస్‌, మంజుల, ప్రసాద్‌ పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రవిశంకర్‌
- వెలిచాలలో రైతు వేదిక, రామడుగులో ఆరోగ్య ఉపకేంద్రం, సీసీ రోడ్డు పనుల ప్రారంభం



రైతువేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్‌

రామడుగు: రాష్ట్రప్రభుత్వం రైతును రాజుగా చేయడమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ తెలిపారు. మండలంలోని వెలిచాల గ్రామంలో రైతువేదిక, రామడుగులో ఆరోగ్యఉపకేంద్రం, సీసీరోడ్డు పనులను గురువారం ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాలు వ్యవసాయం దండుగంటే నేడు రాష్ట్రప్రభుత్వం పండుగలా మార్చిందన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటుచేసిన రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామడుగు, కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మన్‌ వీర్ల వెంకటేశ్వర్‌రావు, ఒంటెల మురళీకృష్ణారెడ్డి, గోపాల్‌రావుపేట మార్కెట్‌కమిటీ చైర్మన్‌ మామిడి తిరుపతి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, తవుటు మురళీ, జిల్లా రైతుబంధు కమిటీ సభ్యులు వీర్ల సంజీవరావు, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మండల రైతుబంధు కమిటీ కోర్డినేటర్‌ జూపాక కరుణాకర్‌, సర్పంచ్‌ పంజాల ప్రమీల, మండల ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

గంగాధర: అనారోగ్యంతో బాధపడే వారికి వైద్యఖర్చుల నిమిత్తం ఎల్‌వోసీ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ పేర్కొన్నారు. మండలంలోని వెంకటాయిపల్లికి చెందిన నందగిరి మధుసుధన్‌రెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష విలువైన ఎల్‌వోసీ కాపీని గురువారం అందించారు. నిరుపేద కుటుంబాలు ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చికిత్సపొందడానికి సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి నిధులు మంజూరు చేయించి ఆర్థికంగా అండగా నిలుస్తున్నామన్నారు.

అభివృద్ధికి కేరాఫ్‌ నర్సింగాపూర్‌

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌
- నూతన జీపీ భవనం పనులు ప్రారంభం
- పలు అభివృద్ధి పనులకు రూ.50లక్షలు నిధులు మంజూరు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, సర్పంచ్‌ మమత

తిమ్మాపూర్‌: మండలంలోని మారుమూల గ్రామమైన నర్సింగాపూర్‌ గ్రామం అభివృద్ధికి కేరాఫ్‌గా మారిందని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అన్నారు. గురువారం గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సర్పంచ్‌ తోట మమతతో కలిసి గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామ అభివృద్ధికి కృషిచేస్తున్న సర్పంచ్‌ను అభినందించారు. అనంతరం సుమారు రూ.50 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ కార్యాలయం నూతన భవనం, సీసీరోడ్లు, మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి శంకుస్థాపనచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయమన్నారు. అంతకుముందు బీఆర్‌ఎస్‌ జెండాఆవిష్కరించారు. అనంతరం పొలంపల్లిలో సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందించారు.బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌, తోటమధు, ఆత్మకమిటీ చైర్మన్‌ పాశం అశోక్‌రెడ్డి, పొలంపల్లి సర్పంచ్‌ బొజ్జ తిరుపతి, మన్నెంపల్లి ఉపసర్పంచ్‌ పొన్నం అనిల్‌గౌడ్‌, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్‌ ఎలుక ఆంజనేయులు, పొలంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు ఖమ్మం కృష్ణ, టీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు బండారి కుమారస్వామి, ఎంపీడీవో రవీందర్‌ రెడ్డి, ఏవో సురేందర్‌, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిడతల రామాయణం



కళాకారులను సన్మానిస్తున్న సర్పంచ్‌

మానకొండూర్‌: మండలంలోని వన్నారం గ్రామంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న చిడతల రామాయణంలో గురువారం పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాకారులు తమ పాత్రాభినయంతో ఎంతగానో ఆకట్టుకున్నారు. రామాయణంలోని ప్రధాన ఘట్టాలను కళాకారులు ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్‌ కవిత గురువు నల్లగొండ రమేశ్‌ కళాకారులు మాజీ సర్పంచ్‌ బకారపు శ్రీనివాస్‌ జంగిలి రమేశ్‌, కొమ్మరాజుల వెంకటయ్య, బాకారపు రాములు, బాకారపు రామచంద్రం, జంగిలి రాములు, బాకారపు రవి, సంపత్‌ను శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఉపసర్పంచ్‌ తిరుపతి, వార్డ్‌మెంబర్లు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

- మున్సిపల్‌ చైర్మన్‌ రాజేశ్వర్‌రావు
- జమ్మికుంటలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చైర్మన్‌ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: పట్టణాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని మున్సిపల్‌ చైర్మన్‌ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. గురువారం మున్సిపల్‌ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వాకింగ్‌ట్రాక్‌ మరమతులు, 23వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణం పనులకు భూమి పూజచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతోందని, మున్సిపల్‌ మంత్రి కేటీఆర్‌ సహకారంతో ఎంతో అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ పొనగంటి సంపత్‌, కౌన్సిలర్లు పొనగంటి మల్లయ్య, పాతకాల రమేశ్‌, దయ్యాల శ్రీనివాస్‌, గాజుల భాస్కర్‌, పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్‌, మాజీ మార్కెట్‌ చైర్మన్‌ తుమ్మేటి సమ్మిరెడ్డి, నాయకులు, వాకర్స్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ వార్డుకమిటీల ఎన్నిక

జమ్మికుంట: మున్సిపల్‌ పరిధిలోని పలువార్డుల్లో మున్సిపల్‌ చైర్మన్‌ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రా వు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ వార్డు అధ్యక్షులను గురువారం నియమించారు. 21వ వార్డు అధ్య క్షుడిగా ఎండీ. ఖదీర్‌, 22వార్డు అధ్యక్షుడిగా మ ంద రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



శంకరపట్నం: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో గురువారం బీరన్న ఉత్సవాల్లో భాగంగా పోచమ్మ తల్లికి కురుమ కులస్తులు మహిళలు బోనాలు సమర్పించారు. ఇంటికో బోనంతో గ్రామస్తులు డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయానికి తరలివెళ్లి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పిల్లా పాపలను చల్లగా చూడాలని వేడుకున్నారు.